సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం, 29, జూలై, 2025



జేబుకి చిల్లు..!

ప్రభుత్వం నూతన వాహనాల రిజిస్ట్రేషన్ తదితర సర్వీస్ ఛార్జీలు భారీగా పెంచింది.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద 1.34 లక్షల క్యూసెక్కులకు పెరిగింది.

వివరాలు 8లో ▸



వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితులకు సత్వర న్యాయం అందాలి



మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు వారికి సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.జానకి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది బాధితులతో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ సదరు పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిత్యం వాటిపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఓ వృద్ధురాలు మెట్ల మార్గంలో మొదటి అంతస్తులోకి వెళ్లడానికి ఇబ్బంది పడటంతో ఎస్పీనే కిందకు వచ్చి మహిళతో మాట్లాడి ఫిర్యాదు స్వీకరించారు.

1 నుంచి కార్మికులకు కొత్త పథకం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ)లో కొత్తగా నమోదయ్యే కార్మిక ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం' ప్రవేశపెట్టిందని పీఎఫ్ నోడల్ ఆఫీసర్ శ్రీలతారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక చైతన్య సెంట్రల్ స్కూల్‌లో పీఎఫ్ ఖాతాదారుల సమస్యలపై 'నిధి ఆప్కే నిక్కత్–2' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి కొత్తగా ఉద్యోగాల్లోకి చేరి తొలిసారి ఈపీఎఫ్‌ఓలో పేరు నమోదైన వారికి రూ.15 వేల ప్రోత్సాహకం లభిస్తుందన్నారు. ఇది ఏడాదిలో రెండుసార్లు (ఆరు నెలలకోసారి) నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ అవుతుందన్నారు. ఈ ప్రయోజనం రూ.లక్ష వరకు వేతనం వచ్చే కొత్త ఉద్యోగులందరికీ వర్తిస్తుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పీఎఫ్ సెక్షన్ సూపర్‌వైజర్ శరత్, వివిధ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 26 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు 26 అడుగులకు చేరింది. ఈ నెల 1న ప్రాజెక్టులో కేవలం 11 అడుగుల కనిష్ట స్థాయిలో ఉండగా అదేరోజు జూరాల నుంచి కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఫేస్–1లో ఒక పంపును రన్ చేసి నీటిని విడుదల చేశారు. 6న తీలేరు వద్ద ఉన్న ఫేస్–2 పంపుహౌస్‌కు చేరిన నీటిని ఒక పంపును రన్ చేసి కోయిల్‌సాగర్‌కు విడుదల చేశారు. గత 22 రోజుల నుంచి ఎత్తిపోతల ద్వారా వస్తున్న నీటితోనే ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీనికితోడు ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో పెద్ద వాగు ద్వారా కొంత నీరు కూడా ప్రాజెక్టులోకి చేరుతోంది. కాగా.. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా మరో 0.6 అడుగుల నీరు రావాల్సి ఉంది. అలాగే ప్రాజెక్టు గేట్ల స్థాయి 32.6 అడుగులు కాగా మరో 6.6 అడుగుల నీరు వస్తే పూర్తిస్థాయికి చేరుకుంటుంది. ఇదిలా ఉండగా.. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది.

దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి గాను విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ ద్వారా సెప్టెంబర్ 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం నవోదయ విద్యాలయం లేదా ఉమ్మడి జిల్లాలోని మండల విద్యాధికారుల కార్యాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

● అరుణ X బండారి

బీజేపీలో రగడ!

నేతల మధ్య రచ్చకెక్కిన అంతర్గత పోరు

- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలోనే బహిర్గతం
- చిచ్చురేపిన డీకే మాటలు.. మనస్తాపానికి గురైన శాంతికుమార్?
- ఎంపీ అనుచరుల గోబ్యాక్ నినాదాలపై పార్టీలో భిన్నస్వరాలు
- తెరపైకి బీసీ వాదం.. 'కమలం' శ్రేణుల్లో అయోమయం
- 'స్థానిక' ఎన్నికల వేళ నష్టం వాటిల్లుతుందని ఆందోళన



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: క్రమశిక్షణకు పెద్దపీట వేసే భారతీయ జనతా పార్టీకి సంబంధించి పాలమూరులో ఇటీవల చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు కలకలం సృష్టిస్తున్నాయి. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ మధ్య ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో బహిరంగ సమావేశం వేదికగా అంతర్గత పోరు రచ్చకెక్కగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. శాంతికుమార్ గో బ్యాక్ అంటూ డీకే అనుచరుల నినాదాలు.. వేదికపై ఆయనను ఉద్దేశించి అరుణ పరోక్షంగా మాట్లాడిన మాటలు పార్టీలో చిచ్చు రాజేశాయి. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన శాంతికుమార్ స్తబ్ధుగా ఉండగా.. ఆయన అనుచరులు మాత్రం మండిపడుతున్నారు. ఈ క్రమంలో బీసీ వాదం తెరపైకి రాగా.. పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. రానున్న స్థానిక ఎన్నికల వేళ నష్టం వాటిల్లే అవకాశం ఉందని గ్రామ, మండల, పట్టణ స్థాయి నాయకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

శ్రేణుల్లో భిన్న స్వరాలు..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో జరిగిన పరిణామాలపై పార్టీ శ్రేణుల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణను ఓడించేందుకు శాంతికుమార్ కుట్ర చేశారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆమె వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో బీజేపీకి పనిచేయకుండా రాజీనామా చేసిన వారిని ఆయన సమావేశానికి తీసుకొచ్చారని.. దీనిపై సమాధానం చెప్పాలన్నారు. తాము ఎవరి వర్గం కాదని.. పార్టీకి రాజీనామా చేసిన వారు సమావేశానికి రావడంతో ప్రశ్నించినట్లు కొందరు చెబుతున్నారు. ఇదే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణపేట, మక్తల్, గద్వాలలో డీకే అరుణ తన కుటుంబ సభ్యుల కోసం బీజేపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారని.. ఆమె అవకాశవాద రాజకీయ పోకడలతో విసిగి ఇద్దరు, ముగ్గురు ముఖ్య నేతలు పార్టీని వీడారని ఆరోపిస్తున్నారు. పాలమూరులో బీజేపీ బలోపేతానికి శాంతికుమార్ ఎంతో కష్టపడ్డారని.. ఆయనకు రెండు సార్లు ఎంపీ టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారిందని.. అయినా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొంటున్నారని చెబుతున్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తన సమక్షంలో జరిగిన ఈ ఘటనను ఖండించకపోవడం.. తన ప్రసంగంలో శాంతికుమార్ పేరును ప్రస్తావించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఇరువర్గాల నాయకుల వాగ్వాదం (ఫైల్)

గో బ్యాక్ నినాదాలు.. మాటల తూటాలు

మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఇటీవల నిర్వహించిన కార్యకర్తల సమ్మేళనం రసాభాసగా మారిన విషయం తెలిసిందే. రెండు వర్గాలుగా విడిపోయిన ఎంపీ డీకే అరుణ, శాంతికుమార్ అనుచరులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎదుటే బాహాబాహీకి దిగారు. శాంతికుమార్‌ను వేదికపై రాకుండా డీకే వర్గం యత్నించడంతోపాటు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ప్రతిగా శాంతికుమార్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆయన అనుచరులు నినదించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు కలుగజేసుకుని గొడవ సద్దుమణిగించారు. ఆ తర్వాత డీకే అరుణ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని ఓడించేందుకు పనిచేశారని.. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పరోక్షంగా శాంతికుమార్‌ను ప్రస్తావిస్తూ రాష్ట్ర అధ్యక్షుడిని కోరారు. ఈ పరిణామాలతో శాంతికుమార్ వర్గీయులు గుర్రుగా ఉన్నారు.

సీనియర్ల మండిపాటు..

పార్టీలో లోటుపాట్లు, నేతల మధ్య విభేదాలపై అంతర్గత వేదికలపైనే చర్చించుకోవడం.. సమస్యలను పరిష్కరించుకోవడం బీజేపీకి ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత రాంచందర్‌రావు తొలిసారి చేపట్టిన జిల్లా పర్యటనలో నేతల మధ్య విభేదాలు బహిరంగ సమావేశంలో రచ్చకెక్కడంపై ఆ పార్టీలోని సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో కొత్త సంప్రదాయానికి తెరలేపారని.. ఇది మంచి పద్ధతి కాదని మండిపడుతున్నారు. ఆదిలోనే కట్టడి చేయాలని.. లేకుంటే మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. స్థానిక ఎన్నికల వేళ పార్టీకి నష్టం వాటిల్లేలా ప్రస్తుత పరిణామాలు ఉన్నాయని.. పార్టీ అధిష్టానం దృష్టిసారించి సమస్య సద్దుమణిగేలా చూడాలని కోరుతున్నారు.

బీసీ సంఘాల ఆగ్రహం

బీజేపీలో తాజా పరిణామాల క్రమంలో బీసీ వాదం తెరపైకి వచ్చింది. మున్నూరు కాపు వర్గానికి చెందిన శాంతికుమార్‌ను డీకే అరుణ అవమానించారని.. ఇది తగదంటూ పలు సంఘాలు భగ్గుమంటున్నాయి. బీసీ సమాజానికి ఆమె క్షమాపణ చెప్పేలా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. లేకుంటే రానున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని బీసీ సమాజ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, బీసీ మేధావుల సంఘం, మున్నూరుకాపు సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.

2019 నుంచీ కోల్డ్‌వార్..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గద్వాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా డీకే అరుణ పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో ఆమెకు పరాజయం ఎదురైంది. అనంతరం రాజకీయ పరిణామాల క్రమంలో ఆమె పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఈ ఎన్నికల్లో ఆమెతోపాటు శాంతికుమార్ టికెట్ ఆశించారు. బీజేపీని గెలిపించాలని పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు వెలిశాయి. పోటీగా డీకే అరుణ వర్గం కూడా ఆమె ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. ఇలా అప్పటి నుంచే ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ మొదలైంది. ఇక 2024 ఎంపీ ఎన్నికల్లో సైతం ఇద్దరూ టికెట్ ఆశించారు. బీజేపీ అధిష్టానం డీకే అరుణ వైపు మొగ్గు చూపగా.. ఆమె పోటీ చేసి గెలుపొందారు. ఇలా రెండు పర్యాయాలు శాంతికుమార్‌కు టికెట్ వచ్చినట్లే వచ్చి చివరలో చేజారింది.

బడుల బలోపేతం దిశగా..

- ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా ప్రారంభం కానున్న 90 పాఠశాలలు
- వసతుల కల్పనకు రూ.1.50 లక్షల చొప్పున మంజూరు
- ఈసారి నుంచే ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లకు అనుమతి
- జాతీయ స్థాయి సిలబస్ బోధనకు చర్యలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రీప్రైమరీ (పూర్వపు ప్రాథమిక విద్య)ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రైవేటు స్కూళ్లలో ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూళ్లు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటులో చేర్పిస్తున్నారు. తద్వారా అన్ని స్థాయిల్లో ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులు అలవాటు పడుతున్నారు. ఈ లోపాన్ని సరిదిద్ది సర్కారు బడుల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం పూర్వపు ప్రాథమిక విద్య అందించేందుకు చర్యలు చేపట్టింది. అందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 ప్రీ ప్రైమరీ స్కూళ్లను నెలకొల్పాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా ప్రారంభించిన పాఠశాలల్లో 4–5 ఏళ్ల పిల్లలను చేర్చుకోవాలని సూచించింది.

ఇద్దరు చొప్పున నియామకం..

ప్రతి ప్రీ ప్రైమరీ పాఠశాలకు ఇద్దరు సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో ఒక టీచర్ ఇంటర్మీడియట్‌తోపాటు ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్, ప్రైమరీ టీచింగ్‌లో అర్హులై ఉండాలి. విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు ఒక ఆయాను కూడా నియమించాల్సి ఉంది. ఆమెకు కనీసం 7వ తరగతి అర్హత ఉండి స్థానికులై ఉండాలి. వీరిని జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ జాతీయ స్థాయిలో అమలుపరుస్తున్న సిలబస్‌ను బోధించాల్సి ఉంటుంది.

ప్రైమరీ పాఠశాలల్లో..

నూతనంగా ప్రారంభించే ప్రీ ప్రైమరీ స్కూళ్లకు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైమరీ పాఠశాలల్లో ఒక తరగతి గదిని కేటాయించనున్నారు. అనంతరం అందుబాటులో ఉండే నిధుల ఆధారంగా కొత్త గదులను నిర్మించనున్నారు. వీటిలో వసతుల కల్పన కోసం ఒక్కో బడికి రూ.1.50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో విద్యార్థులు ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఆడేందుకు బొమ్మలు, గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయడం, బెంచీలు, బోర్డులు, కుర్చీల వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటి కొనుగోలు పూర్తిగా కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలి. వీటితోపాటు అన్ని పాఠశాలల మాదిరిగానే మధ్యాహ్న భోజనం, స్నాక్స్ వంటివి విద్యార్థులకు అందిస్తారు.



ఏయే పాఠశాలల్లో అంటే..

ఎంపీపీఎస్ బాదేపల్లి తెలుగువాడ, బోడజానంపేట, బాదేపల్లి (బీఓ), కన్మనూర్, కొత్తూర్, ఎల్లంబాయితండా, గురుకుంట, వెంకట్‌రెడ్డిపల్లి, కాటవరం, జంగమయ్యపల్లి, రావులపల్లి, బాదేపల్లి (కొత్తబజార్), రెడ్డిపల్లి, వాడ్యాల్, పెద్దతండా, కొల్లంపల్లి, ధర్మాపూర్, సింగనోనిపల్లి, గొల్లబండతండా, చౌదర్‌పల్లితండా, సింగాయపల్లి, చౌదర్‌పల్లి, బల్సూర్‌గొండ, మున్ననూర్, చెడుగుట్ట, మణికొండలో ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.

అడ్మిషన్లు తీసుకుంటాం..



మహబూబ్‌నగర్ జిల్లాలో 26 ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల్లోనే ఒక గదిలో ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభిస్తాం. ఇందుకోసం ఒక్కో పాఠశాలలో వసతుల కల్పన కోసం రూ.1.50 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

జిల్లాల వారీగా ప్రీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు ఇలా..

జిల్లా	పాఠశాలలు
మహబూబ్‌నగర్	25
జోగులాంబ గద్వాల	18
నారాయణపేట	10
నాగర్‌కర్నూల్	20
వనపర్తి	17

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి తదితరులు


జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మండలాల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పీహెచ్‌సీ, హెల్త్ సబ్‌సెంటర్లు సందర్శించి ఏమైనా సమస్యలు, లోపాలు ఉంటే గుర్తించాలన్నారు. మహమ్మదాబాద్ పీహెచ్‌సీలో షార్ట్‌సర్క్యూట్ సమస్య పరిష్కరించాలని చెప్పారు. అన్ని పీహెచ్‌సీల్లో లేబర్ రూంలు వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. జ్వరాలు ప్రబలిన గ్రామాలను వైద్యాధికారులు సందర్శించి.. అవసరమైన వైద్యసహాయం అందించాలని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని, వర్షాలు, వరదలు వలన విపత్తు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే యూరియా, ఎరువులు స్టాక్, రైతులకు సరఫరాపై నిత్యం సమీక్షించాలని సూచించారు. యూరియా పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాలకు మళ్లించకుండా దృష్టిసారించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహంలో తాగునీరు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాల వలన వరద నీరు పొంగి ప్రవహించే కాజ్‌వేలను గుర్తించి ట్రాఫిక్ మళ్లించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆస్పత్రులు శిథిల భవనాల్లో నిర్వహించవద్దన్నారు. డీఆర్‌డీఓ నర్సింహులు మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పటికే 27 లక్షల గుంతలు తీసి.. 21 లక్షల మొక్కలు నాటామని, ఆగస్టు మొదటి వారంలోగా మరో 8 లక్షల మొక్కలు నాటుతామని పేర్కొన్నారు. అలాగే 8 లక్షల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సిటిజన్ ఫీడ్ బ్యాక్ కింద మొబైల్ యాప్‌లో ఫీడ్ బ్యాక్ ఆగస్టు 31లోగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీఓ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, ఆర్డీఓ నవీన్, జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. పీయూలో సోమవారం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ సెంటర్ ఫర్‌ది డెవలప్‌మెంట్ సహకారంతో నిర్వహించిన 7 రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకునేందుకు నిత్య విద్యార్థిగా మారాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలని, తోటి వ్యక్తులతో సమాజంలో ఎలా నడుచుకోవాలో నేర్పించాలని, భావోద్వేగాల నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అప్పుడు ఒక విద్యార్థి సంపూర్ణంగా, సమగ్రంగా అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, రీసోర్సుపర్సన్ షాలిని, కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, కోకన్వీనర్ బషీర్ అహ్మద్, జయ నాయక్, విజయలక్ష్మి, ఆంజనేయులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ ప్రాక్టికల్స్



ఏనుగొండ శివారులో క్షేత్రస్థాయి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న సర్వే అధికారి ఎండీ మూసా

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపికకు రెండు నెలలుగా శిక్షణ ఇచ్చిన సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ సోమవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించింది. మొదటి విడతగా శిక్షణ ఇచ్చిన అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలను పూర్తి చేసింది. లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 230 మంది అభ్యర్థులుండగా వారిని ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. అందులో మొదటి విడతగా 132 మందికి భూసర్వే నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రెండు నెలలుగా శిక్షణ పొందిన 98 మంది అభ్యర్థులలో సోమవారం 47 మందికి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించగా.. మిగతా 51 మంది అభ్యర్థులకు మంగళవారం నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం వారి ఫలితాలు వెల్లడించి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తారు. కాగా.. జిల్లాలో గత మే నెలలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా నియమించేందుకు అవసరమైన శిక్షణను జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. చైన్ సర్వే, టోటల్ సర్వే వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ హద్దుల గుర్తింపు, సర్వే నంబర్లలోని సబ్‌డివిజన్ సమస్యపై చేపట్టాల్సిన సర్వే వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ కిషన్‌రావు పర్యవేక్షణలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎండీ మూసా, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి పర్వతాలు మొదటి బ్యాచ్‌కు రెండు నెలలపాటు క్షేత్రస్థాయి భూ సర్వేపై అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి ఆర్వోఆర్–2025 చట్టం అమలులో వీరి సేవలు వినియోగించనున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ యువతకు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ తరఫున నాలుగు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు కింద కోచింగ్ కోసం దరఖాస్తు తేదీని వచ్చే నెల 21 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ తోపాటు సమీప భవిష్యత్‌లో జరిగే ఇతర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం, ఉత్తీర్ణత సాధించడానికి ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. నాలుగు నెలల కోర్సు అని, ఇందులో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారన్నారు. అర్హులైన మైనార్టీ నిరుద్యోగ యువత అవసరమైన సర్టిఫికెట్‌లను దరఖాస్తుతో జతచేసి వచ్చే నెల 21 వరకు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నం.94409 70730ను సంప్రదించాలని సూచించారు.

ఏడాదిలో 500 పార్లర్ల ఏర్పాటుకు కృషి



- నెలకు రూ.10 కోట్ల నష్టం నుంచి రూ.3 కోట్లకు తగ్గించాం
- ఫెడరేషన్ పరిరక్షణకు కఠిన నిర్ణయాలు తప్పవు
- ఇప్పట్లో పాల ధర పెంచే యోచన లేదు
- రాష్ట్ర పాడిపరిశ్రమశాఖ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

- వివరాలు 8లో..

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


గుంటిశేఖర్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తూడుకుర్తి పరిధి భాగ్యనగర్‌కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. భాగ్యనగర్‌కాలనీకి చెందిన గుంటిశేఖర్ (45) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తన పొలంలో బోరుమోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరి మృతి

మరికల్: కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన సోమవారం తీలేర్ స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధన్వాడకు చెందిన కావలి భాస్కర్(37) ట్రాక్టర్‌కు సంబంధించిన సామగ్రిని తీసుకరావడానికి బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా మరికల్ మండలం తీలేర్ స్టేజీ సమీపంలోకి రాగానే షాద్‌నగర్ నుంచి రాయిచూర్ వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో భాస్కర్ ఎగిరి ముళ్లపొదల్లో పడి అక్కడిక్కడే మృతిచెందాడు. కారు చెట్టుకు ఢీకొని పల్టీలు కొట్టి నిలిచిపోయింది. కారులో ఉన్న చిన్నారితోపాటు నలుగురు కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

కారు, బైక్ ఢీ: యువకుడు మృతి

వనపర్తి రూరల్: కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చిట్యాల శివారులో చోటుచేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. వనపర్తి పట్టణంలోని పాతబజార్‌కు చెందిన శివ (35) అతని స్నేహితుడు పుట్ట కుర్మయ్య కలిసి జంగమాయిపల్లి నుంచి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై వనపర్తికి వస్తుండగా, మార్గమధ్యలో చిట్యాల శివారులో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరు కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే వారిని వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు శివను హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా కొత్తకోట శివారులో మృతిచెందాడు. పుట్ట కురుమయ్య గాయాలతో వనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సోమవారం శివ భార్య ఆవల శారద శతమానం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. వంగూరు మండలంలోని ఉల్పర గ్రామానికి చెందిన గున్నమోని శ్రీను(45) తన ద్విచక్ర వాహనంపై అదే గ్రామానికి చెందిన మల్లయ్యతో కలిసి కారువంగ గ్రామానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో గున్నమోని శ్రీను ఒక్కరే తన ద్విచక్రవాహనంపై కారువంగ నుంచి ఉల్పరకు బయలుదేరాడు. కారువంగ గ్రామ సమీపంలో మాదవరెడ్డి పొలం దగ్గర ఉన్న ఎడ్ల బండికి ప్రమాదవశాత్తు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య గున్నమోని భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి చెందిన ఘటన మూసాపేట మండలం జానంపేట వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జానంపేట గ్రామానికి చెందిన బాల కుర్మయ్య, మద్దిగట్ల అంజమ్మ(60) దంపతులు. ఇటీవల అంజమ్మ పుట్టింటికి వెళ్లింది. భర్త అనారోగ్యానికి గురికావడంతో భార్య అంజమ్మ జానంపేటకు బయలుదేరింది. ఆదివారం రాత్రి జానంపేటలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్లే కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అంజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల: కొల్లోనిమర్ల తండాకు చెందిన ఇంటర్ విద్యార్థిని హర్షిత(16) ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండావాసులు తెలిపారు. కాగా మృతురాలు జిల్లాకేంద్రంలోని ఓ ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసినట్లు తెలిసింది. అంతకుముందు మరో రెండు కళాశాలల్లో ప్రవేశపరీక్ష రాసిందని, చదువు ఇష్టం లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. కూతురు ఆత్మహత్యతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కన్నీటిపర్యంతమయ్యారు. విద్యార్థిని ఆత్మహత్యపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వాహనదారుడి జేబుకు చిల్లు..!


రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వాహనదారులు

- రవాణా శాఖలో భారీగా పెరిగిన సర్వీస్ ఛార్జీలు
- సోమవారం నుంచి అమల్లోకి..
- ఉమ్మడి జిల్లాలో నిత్యం 250 రిజిస్ట్రేషన్స్, 200 డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించిన నూతన వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఫీజులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ, పర్మిట్స్, ఇతర లావాదేవీలకు సంబంధించి సర్వీస్ ఛార్జీలు భారీగా పెంచింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని వాహనదారుల జేబులకు భారీ స్థాయిలో చిల్లు పడనుంది. గతంలో ఉన్న ఫీజులతో పోలిస్తే ప్రస్తుతం రెండు రెట్లు ఎక్కువ పెంచడం జరిగింది. పెంచిన సర్వీస్ ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏడు ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతి రోజు డ్రైవింగ్ లైసెన్స్‌లు 200 జారీ కాగా నూతన వాహనాల రిజిస్ట్రేషన్స్ 250వరకు అవుతున్నాయి. దీంతో పాటు ఫిట్ నెస్ సర్టిఫికెట్స్ జారీ, పరిమిట్స్, ఇతర రిజిస్ట్రేషన్స్ కలిపి 600అవుతున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం వస్తోంది. ప్రస్తుతం పెంచిన సర్వీస్ ఛార్జీల వల్ల ఆర్టీఏ కార్యాలయాల నుంచి ఆదాయం మరింత రెట్టింపు కానుంది.

8 ఏళ్ల తర్వాత పెంపు

రాష్ట్ర రవాణా శాఖలో 2017 మే 6న సర్వీస్ ఛార్జీలు పెంచుతూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత మళ్లీ సర్వీస్ ఛార్జీలు పెంచడం జరిగింది. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించే సర్వీస్ ఛార్జీలు పెంచడం వల్ల ఎలాంటి రిజిస్ట్రేషన్ అయిన లైసెన్స్ పొందాలన్నా ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ఇక ద్విచక్ర వాహనాల్లో బైక్ మాడల్ ధర బట్టి సర్వీస్ ఛార్జీలలో మార్పులు ఉంటాయి. అదేవిధంగా కార్లలో కూడా వాటి ధరల ప్రకారం సర్వీస్ ఛార్జీలు పెరుగుతుంటాయి. ప్రస్తుతం ఉన్న ఛార్జీలతో పోలిస్తే కొత్తగా ఛార్జీలు రెట్టింపు అయ్యాయి.

సర్వీస్ ఛార్జీల వివరాలిలా..

రిజిస్ట్రేషన్ వివరాలు	వ్యాలిడిటీ	పాత ఛార్జీ	పెరిగిన ఛార్జీ
వాహనపత్రాలు	3-12 నెలలు	25	50
రూ.500ల కంటే ఎక్కువ	3-12 నెలలు	50	100
లెర్నింగ్ లైసెన్స్	6 నెలలు	100	200
ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్	6 నెలలు	100	200
లైట్ మోటార్ వెహికిల్	1-5 ఏళ్లు	200	300
ఇతర లైట్ మోటార్ సైకిల్	3 ఏళ్లు	200	300
నాన్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్	1-20 ఏళ్ల వరకు	300	400
రిజిస్ట్రేషన్ నాన్ ట్రాన్స్‌పోర్ట్			
ఆర్‌సీఎస్ ద్విచక్ర వాహనం నాన్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్‌సీఎస్	1-15 ఏళ్లు	200	వాహనధరపై 0.5శాతం
టూ వీలర్ రెండు కంటే ఎక్కువ	1-15 ఏళ్లు	400	వాహన ధరపై 0.1శాతం
ఆటోలు, కార్లు రిజిస్ట్రేషన్,	ఏడాది పైనా	150	500

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

సుప్రీంకోర్టుతో పాటు రోడ్డు రవాణా కమిషనర్ విడుదల చేసిన జీవో ప్రకారం.. ప్రతి వాహనదారుడు జాతీయ రహదారితో పాటు ఇతర రోడ్డు మార్గాలలో అతివేగంగా వాహనం నడపరాదు. ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పక పాటించాలి. లారీలతో పాటు, ఇతర ప్రైవేట్ వాహనాలు అధిక లోడ్‌తో రాకపోకలు సాగించవద్దు. లారీ డ్రైవర్స్ ప్రయాణికులను ఎక్కించుకొని రహదారిపై ప్రయాణం చేస్తే వారిపై కఠిన చర్యలతో పాటు కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుంది. మద్యం సేవించి వాహనం నడపరాదు. ఒకవేళ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కోర్టు ఎదుట హాజరుపరచడంతో పాటు వారం నుంచి 30రోజుల వరకు జైలు శిక్ష పడుతుందని నిబంధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా వాహనాలు నడుపుతూ ఫోన్ మాట్లాడినా, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు తీసుకొని వాహనాలు నడిపినా సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నుంచి ఆరు నెలల పాటు రద్దు చేయడం, వారిపై కేసులతో పాటు జైలు శిక్ష పడటం జరుగుతుంది.

పెంచిన ఛార్జీలు అమల్లోకి వచ్చాయి..



పెంచిన సర్వీస్ ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. 2017 తర్వాత ఇప్పుడు పెంచడం జరిగింది. అన్ని రకాల రిజిస్ట్రేషన్స్‌తో పాటు లైసెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ ఇలా అన్నింటిపై ఛార్జీలు పెరిగాయి. వాహనదారులు పెరిగిన సర్వీస్ ఛార్జీల ప్రకారం రవాణా సేవలు పొందాల్సి ఉంటుంది.

– కిషన్, డీటీసీ ఉమ్మడి జిల్లా

కారులో సీటు బెల్టు తప్పనిసరి

ఈ మధ్య కాలంలో ద్విచక్ర వాహనాల కంటే కార్ల సంఖ్య పెరిగిపోతున్నాయి. ఈక్రమంలో కారు నడుపుతున్న డ్రైవర్‌తో పాటు ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాల్సిందే. ఎలాంటి పరిస్థితుల్లో అయినా సీట్ బెల్టు పెట్టుకోకుండా కారు నడిపితే అలాంటి డ్రైవర్స్‌కు సంబంధించిన డ్రైవింగ్ లెసెన్స్‌లను మూడు నుంచి ఆరు నెలల పాటు రద్దు చేయనున్నారు. వాటితో పాటు మూడు గంటల పాటు సిట్టు బెల్టు పెట్టుకోవాలనే అంశంపై ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుంది.

సీడ్‌పత్తి రైతులకు బకాయిలు చెల్లించండి


వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: జిల్లాలో విక్రయించిన సీడ్‌పత్తికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే సంబంధిత రైతులకు చెల్లించాలని సీడ్ కంపెనీలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. బాధిత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో సీడ్‌పత్తిని సాగుచేస్తున్నారని, అయితే గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి పండించిన పంట డబ్బులను సీడ్‌కంపెనీలు చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తుమ్మలకు వివరించారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సీడ్‌కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఏడాదిలో 500 పార్లర్ల ఏర్పాటుకు కృషి

- నెలకు రూ.10 కోట్ల నష్టం నుంచి రూ.3 కోట్లకు తగ్గించాం
- రాష్ట్ర పాడిపరిశ్రమశాఖ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి


జడ్చర్ల విజయ డెయిరీలో మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

జడ్చర్ల టౌన్/ మిడ్జిల్: రాష్ట్రంలో విజయ డెయిరీ ద్వారా ఏడాదిలోపు 500 పార్లర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర పాడిపరిశ్రమశాఖ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని విజయ డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ, ఫెడరేషన్ పరిరక్షణకు కఠిన నిర్ణయాలు తప్పవన్నారు. ఇప్పట్లో పాలధర పెంచే యోచన లేదని స్పష్టం చేశారు. రెండేళ్లుగా విజయ డెయిరీ ప్రతినెలా రూ.10 కోట్ల వరకు నష్టంలో ఉండేదని, తాము తీసుకున్న కఠిన నిర్ణయాలతో రెండు నెలలుగా నష్టం రూ.3 కోట్లకు తగ్గించగలిగామన్నారు. ఖర్చులు తగ్గించడంతోపాటు పాల విక్రయాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే రైతులకు ధరలు తగ్గించామని, సంస్థ లాభాల బాట పట్టాక బోనస్ రూపంలో రైతులకు మేలు చేసే యోచనలో ఉన్నామన్నారు. అలాగే ఆవు పాల సేకరణ తగ్గించి గేదె పాలు సేకరించడం ప్రారంభించాలన్నారు. అందుకు అవసరమైన గేదెలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. జడ్చర్లలో ప్రాసెసింగ్ యూనిట్ ఇప్పట్లో వద్దని, దాని వల్ల ఖర్చులు పెరిగాయని, ముందుగా పాల విక్రయాలు పెంచాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారిపై, పట్టణాల్లో పార్లర్ల ఏర్పాటుకు ముందుకు వస్తే అందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలోనే ఏర్పాటు చేయాలని, తాము కలెక్టర్‌కు సైతం తెలియజేస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు రోజు కర్ణాటక ఫెడరేషన్ నుంచి 30 వేల లీటర్ల పాలు వస్తున్నాయని, అక్కడ ధర తక్కువగా ఉండటంతో చాయ్ క్లబ్‌లు, టీ కేఫ్‌లు పెట్టేవారు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నారన్నారు. విజయ పాలు నాణ్యతతో ఉన్నందున మహిళా సమాఖ్యలు ముందుకు వచ్చి పార్లర్లు ఏర్పాటు చేస్తే పాల ఉత్పత్తులు పంపించే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. అంతకు ముందు రైతులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల ధర పెంచాలని, ప్రాసెసింగ్ యూనిట్ ఇవ్వాలని కోరారు. అనంతరం మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జీఎం మధుసూదన్, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, చిల్లింగ్ సెంటర్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కవిత, డీడీ శ్రీనివాస్, సీసీ స్వర్ణ, సమాఖ్య అధ్యక్షురాలు శాంతాబాయి, కార్యదర్శి రూప, అరుణ, సత్యమ్మ, మేనేజర్ వెంకట్ రెడ్డి, ఏపీఎంలు రవికుమార్, మల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

- 1.34లక్షల క్యూసెక్కుల వరద
- 12 క్రస్ట్‌గేట్ల ఎత్తివేత
- జల విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


సుంకేసుల గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 1.34లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 12 క్రస్ట్‌గేట్లను ఎత్తి 1.19 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27వేల క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 48 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 500 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 200 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.914 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాలలో ఐదు యూనిట్ల ద్వారా 169.364 మిలియన్ యూనిట్లు, దిగువ జూరాలలో ఆరు యూనిట్ల ద్వారా 201.175 మిలియన్ యూనిట్లు కలిపి మొత్తం 370.539 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేపట్టామన్నారు.

సుంకేసులకు భారీగా వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. సోమవారం 97 వేల క్యూసెక్కులు వరద వస్తున్నట్లు దాటినట్లు అధికారులు తెలిపారు. దీంతో నదీ తీర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజోళి మండల అధికారులు సూచించారు. 17 గేట్లను మీటర్ మేర తెరిచి 94,445 క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

ఫుడ్ పాయిజన్‌కు కారణాలేంటి?

- పూర్తి నివేదిక అందజేయండి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసిన హెచ్‌ఆర్‌సీ

సిటీ కోర్టులు: నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అంశంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా మండిపడింది. విద్యార్థులకు సౌకర్యవంతమైన భోజనం అందించకుండా ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించింది. బీసీ గురుకుల పాఠశాలలో ఈ నెల 26న రాత్రి భోజనం చేసిన తర్వాత దాదాపు 111 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతుండటంతో వారిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని దినపత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ వార్తలను పరిశీలించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ స్పందించి సుమోటోగా కేసు నమోదు చేసుకొని సోమవారం విచారణ చేపట్టింది. ఇంత మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురికావడంతో కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది. వార్తల్లో ప్రచురితమైన అంశాలు నిజమని తేలితే, ఆర్టికల్ 21, 21ఏను ఉల్లంఘించినట్లు కమిషన్ అభిప్రాయపడింది. ఫుడ్‌పాయిజన్‌కు కారాణాలేంటి..? ప్రస్తుతం వారి పరిస్థితి ఎలా ఉంది..? పిల్లలకు సౌకర్యవంతమైన భోజనం ఎందుకు ఇవ్వడం లేదు..? దీనిపైన పూర్తి నివేదికను వచ్చే విచారణలోపు అందజేయాలని.. ఇందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కమిషన్ ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

హాస్టల్ విద్యార్థినికి అస్వస్థత


నవాబుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాత్విక

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల బాలికల హాస్టల్ విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో సిబ్బంది మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. సోమవారం మధ్యాహ్నం యన్మన్‌గండ్ల బాలికల హాస్టల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థిని సాత్విక శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో ఉపాధ్యాయులు బాలికలను మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడే బాలికకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా అక్కడ బాలిక కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఇంత జరిగినా హాస్టల్ వార్డెన్‌కు సమాచారం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోయిలకొండ మండలంలోని దమ్మయ్యపల్లి సాత్విక సొంత గ్రామం కాగా యన్మన్‌గుండ్ల హాస్టర్‌లో ఉంటూ చదువుతుంది. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పరామర్శ

పాలమూరు: కోయిలకొండ మండలం కోత్లాబాద్ గ్రామ శివారులో ఈనెల 26న గొర్రెల కాపరి మైబన్న, రైతులు సత్యనారాయణరెడ్డి, చెన్నారెడ్డిపై చిరుత దాడి చేయడంతో వారికి జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. చిరుతదాడి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిని సోమవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు ఆరోగ్యంగా ఉన్నారని మంగళవారం డిశ్చార్జ్ చేస్తామని సూపరింటిండెంట్ ఎమ్మెల్యేకు వివరించారు.


గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ప్రభుత్వ కార్యాలయంలో దొంగలు పడ్డారు

కంప్యూటర్లు.. ప్రింటర్లు అపహరణ


చోరీ జరిగిన కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: ప్రభుత్వ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లను ఎత్తుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కార్యాలయ సిబ్బంది కథనం మేరకు.. గుర్తుతెలియని దుండగులు సోమవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం తలుపులు ధ్వంసం చేసి రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లను తీసుకెళ్లారు. రోజువారి విధుల్లో భాగంగా డీఈలు కబీర్‌దాస్, సతీష్ కార్యాలయానికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు. సిబ్బంది పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలం వద్దకు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ చేరుకుని చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కంప్యూటర్లలో కార్యాలయానికి సంబంధించిన రికార్డులు, బిల్లులు, పలు రకాల ఫైల్స్ హార్డ్ డిస్కుల్లో నిక్షిప్తమై ఉన్నాయని తెలిపారు. అయితే వాటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై డీఈ కబీర్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూల్ బస్సు కింద పడి వ్యక్తి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన బస్సు


బజారన్న అలియాస్ ముక్కెరన్న

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో సోమవారం ఉదయం స్కూల్ బస్సు కింద పడి బల్గెర గ్రామానికి చెందిన బజారన్న అలియాస్ ముక్కెరన్న(60) మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. బల్గెర గ్రామానికి చెందిన బజారన్న అలియాస్ ముక్కెరన్న ఉదయం గ్రామంలోని శ్రీదిగంబరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. బస్టాప్ సమీపంలోని టీ స్టాల్ నుంచి రోడ్డు అవతల ఉన్న ఇంటికి వెళ్తున్న క్రమంలో అయిజలోని ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులతో ఎక్కించుకుని అయిజకు వెళ్తున్న క్రమంలో మూల మలుపు దగ్గర బజారన్న అలియాస్ ముక్కెరన్నను ఢీ కొట్టింది. దీంతో బజారన్న కాళ్లపై నుంచి ముందు టైర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను హుటాహుటిన అయిజకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బజారన్న మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు పరమేష్‌నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచు బల్గెర నారాయణరెడ్డిలు గద్వాల ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.